# చింతపిక్కల

## పరమ పిసినారి బావకే వెర్రి వేదాంతి కళ

"ఓ సిగరెట్ ఇలా కొట్టు."
ప్రసాద్ జేబులోంచి సిగరెట్ పాకెట్ తియ్యడం గమనించిన ఈశ్వరరావు అడిగాడు.

"అదుగో ఎదురుగా ఖాన్ షాపుంది. అందులో సిగరెట్లు, అగ్గిపెట్టెలు, జర్దా కిళ్ళీలు అన్నీ అమ్ముతారు" అని సిగరెట్ పాకెట్ జేబులో పెట్టేసుకున్నాడు ప్రసాద్.

ఈశ్వరరావు ఓ నవ్వు నవ్వాడు.

అలాంటి నవ్వు అతను మాత్రమే నవ్వగలడు.

ఛీ కొడితే చాలా తేలికగా తీసుకునే నవ్వు.

"ఊరికే నస పెట్టకు. ఆ సిగరెట్ పాకెట్ ఇలా ఇయ్యి" అన్నాడు మళ్ళీ.

"నువ్వు రెండు అరచేతులు కలిపి ముష్టాడిలా అడుక్కో ఇస్తాను " అన్నాడు ప్రసాద్.

ఈశ్వరరావు అలాగే చేశాడు.

"అయినా, ఇలా పొద్దుట్నుంచీ సాయంత్రం దాకా కాఫీలు, సిగరెట్లు, టిఫిన్లు- ఎవర్నో ఒకర్ని అడుక్కోడానికి సిగ్గెయ్యదూ?" ప్రసాద్ అడిగాడు.

"తప్పు. మగాడికి సిగ్గు ఉండకూడదు. అయినా, స్నేహితుల మధ్య సిగ్గు, అభిమానం అడ్డు రాకూడదు."

* * *

వాళ్ళిద్దరూ ఒకే ఆఫీసులో పని చేస్తారు. ఈశ్వరరావు పరమ లోభి అన్న విషయం ఆ ఆఫీసులో అందరికీ



చిత్రాలు: నర్శిం

తెలుసు. ఎప్పుడూ సరదాగా, నవ్వుతూ, నవ్విస్తూ హుషారుగా ఉంటాడు కాబట్టి, అతని పిసినారితనాన్ని పట్టించుకోకుండా అతనితో స్నేహం చేస్తారు. అతని మీద ఎలాంటి జోకులు వేసినా, కామెంట్లు చేసినా నవ్వుతూ స్వీకరిస్తాడు.

* * *

"అయినా, నీకు ఈ పిసినారితనం ఎక్కణ్నుంచి వచ్చింది? మీ వంశంలోనే ఉందా?" ప్రసాద్ అడిగాడు.

"లేదు. మా నాన్న దాత. మా తాత మహాదాత. వాళ్ళని చూసి ఎలా ఖర్చుపెట్టకూడదో నేర్చుకున్నాను. అయినా, నన్నేం చూశావు? మా మావగారు ఉన్నాడు. పిసినార్లకు పిసినారి. మహా లోభి, ప్రపంచ పిసినారి సంఘ శాశ్వత అధ్యక్షుడు శ్రీశ్రీశ్రీ చింతపిక్కల సోమరాజుగార్ని చూశావంటే నువ్వు డంగైపోతావ్."

* * *

"సావిత్రీ... సావిత్రీ..."

చింతపిక్కల సోమరాజు భార్యను చాలాసార్లు పిలిచాడు. ఆమె వంటింట్లో పని చేసుకుంటోంది. అతను అసహనంగా ఉన్నాడు.

"ఏవిటి, పాలు తాగని గేద్దూడలా అలా అరుస్తారు" అంటూ విసుక్కుంటూ వచ్చింది.

"పిలవగానే రావాలని ఎన్నిసార్లు చెప్పాను. ఇన్నిసార్లు పిలవడం వల్ల ఎంత శక్తి వృథా అవుతుందో తెలుసా? వృథా అయిన శక్తి పుంజుకోడానికి మళ్ళీ తినాలి. అదో వృథా ఖర్చు. నీకీ సోదంతా చెప్పడానికి మళ్ళీ కొంత శ్రమ వృథా..."

"మీ ఖర్చు గోల, వృథా గోల ఎప్పుడూ ఉండేదే. అసలు విషయం చెప్పండి" అంది సావిత్రి విసుక్కుంటూ.

"ఇవిగో ఉత్తరాలు."

"ఎక్కణ్నుంచి వచ్చాయి?"

"ఒకటి నీ పుత్రరత్నం చంద్రం రాశాడు. రెండోది మనమ్మాయి పరిమళ రాసింది. ఏవైనా చెప్పు. పిల్లల్ని తీరువుగా పెంచకుండా చాలా పాడు చేశావు సావిత్రీ!"

"మధ్యలో నన్నంటారేవిటి? నేనేం చేశాను?"

"ఉత్తరం అన్నది రాయడం క్షేమసమాచారాలు తెలియడానికే కదా? మనమ్మాయి ఓ కార్డు రాస్తే సరిపోలా? పదిహేను పైసల్తో పోతుంది. 75 పైసలు

# సోమరాజు
## తెప్పించిన షోకిల్లా బావమరిది కథ

ఖర్చు చేసి ఇన్‌లాండ్ లెటర్ రాసింది. 60 పైసలు వృథా కాలేదూ? అసలు లింకు ఉత్తరాలు రాయమని పిల్లలకి చాలాసార్లు చెప్పాను. అయినా, నా మాట వినిపించుకునేదెవరు?''

''లింకు ఉత్తరాలా! అదేవిటండీ, ఎప్పుడూ వినలేదు!''

చాలా ఆశ్చర్యపోతూ అడిగింది సావిత్రి.

''ఏమీ లేదు. మనమ్మాయి పరిమళ ఓ కార్డు కొని నగం వరకు తన క్షేమ సమాచారాలు రాసి, మనబ్బాయి చంద్రానికి పోస్టు చేస్తుంది. వాడేమో మిగిలిన నగం రాసి రీ డైరెక్టెడ్ అని నా అడ్రస్ రాసి పోస్టు చేస్తాడు. 15 పైసలతో ఇద్దరి క్షేమసమాచారాలు మనకి తెలుస్తాయి. ఎలా ఉంది అయిడియా?''

''బ్రహ్మాండంగా ఉంది. ఏమండీ మరో పని చెయ్యకూడదూ.''

''ఏవిటది?''

''ఏం లేదు. పొదుపు చెయ్యడానికి పిసినారి సోమరాజు చిట్కాలు అని ఓ పుస్తకం రాయకూడదూ?''

''నీకలా వేళాకోళంగా ఉంటుందే. మా నాన్న పోతూ పోతూ మూడు వేలు అప్పు నా నెత్తిన పెట్టి పోయాడు. అవి తీర్చి, మెల్లగా వడ్డీ వ్యాపారం మొదలు పెట్టి, వడ్డీలకు వడ్డీలు, చక్రవడ్డీలకు చక్రవడ్డీలు కట్టి పొదుపుగా నెట్టుకొస్తూ పదెకరాల మాగాణీ కొన్నాను. ఈ ఇల్లు కట్టించాను. పిల్లకి పెళ్ళి చేశాను. పిల్లాణ్ణి బి.ఏ దాకా చదివించాను. ఈ రోజున అయిదు లక్షల రూపాయలు పిల్లల్ని పెడుతూ వడ్డీలకి తిరుగుతున్నాయి.''

''సిగ్గు లేకపోతే సరి. ఇంత సంపాదించినా, ఇంత కూడబెట్టినా పెళ్ళాం మెళ్ళో పుస్తెలు లేకుండా చేశారు. ఎక్కడికేనా వెళ్ళాలంటే ఈ పసుపుతాడుతోను, ఈ పసుపుకొమ్ముతోను... సిగ్గుగా ఉంటోంది.''

''ఓసి వెర్రి సావిత్రీ! మెళ్ళో పుస్తెలు వేసుకుంటేనే సంఘంలో గౌరవం వస్తుందా? మనిషికి ఉన్నది బలం - గొడ్డుకి తిన్నది బలం అన్నారు.

రెండు పుస్తెలు కలిపి రెండు తులాల-బంగారం. అవునా? అంటే ఎంత? ఎనిమిది వేలు. బంగారం పుస్తెలు చేయించుకున్నాక నూలు తాడుతో కట్టుకుంటే బావుంటుందా? బావుండదు. దానికో తాడు చేయించాలి. నీ పర్సనాలిటీకి, నీ లావు మెడకి కనీసం మూడు కాసుల బంగారం అవసరమౌతుంది. అదో పన్నెండు వేలు. మొత్తం ఇరవై వేలు. అంత బంగారం మెళ్ళో వేసుకుంటే కలిసొచ్చేదేమిటి?

అదే మొత్తం వడ్డీకి తిప్పాననుకో. నెలకి నూటికి నాలుగు రూపాయల చొప్పున ఇరవై వేల రూపాయలకి ఎనిమిది వందలు వడ్డీ వస్తుంది. ఆ ఎనిమిది వందలు మళ్ళీ వడ్డీకి ఇస్తే మూడువందల ఇరవై రూపాయలు వడ్డీ వస్తుంది. మళ్ళీ ఆ మూడు వందల ఇరవై రూపాయలు వడ్డీకిస్తే దాదాపు పదమూడు రూపాయలు - ఆ పదమూడు రూపాయలు...''

సావిత్రికి కోపం నాసాళానికంటింది. ''ఆపండి మీ వడ్డీ గోల... నేను ఛస్తే నాకు పెట్టే అన్నం ఖర్చు మిగుల్తుంది. అది కూడా వడ్డీకి తిప్పుకోవచ్చు.''

పైకి అనలేదు గాని, ఆమె చస్తే కాల్చడానికి కట్టెపుల్లలకెంతవుతుందో, దినం ఖర్చు ఎంతవుతుందో మనసులో లెక్కలు వెయ్యడం మొదలు పెట్టాడు సోమరాజు.

* * *

ఈశ్వరరావు ఆఫీసు నుంచి ఇంటికి చేరేసరికి పరిమళ తన తండ్రి రాసిన ఉత్తరం అతని చేతికందించింది.

''ఆఁ. శ్రీశ్రీశ్రీ చింతపిక్కల సోమరాజుగారు ఉత్తరం రాశాడా? ఏమిటి విశేషం? పొలం మనకి రాసిస్తానన్నాడా'' అని ఆత్రంగా అడిగాడు.

పెళ్ళయి అయిదేళ్ళయినా కట్నంగా ఇస్తానన్న రెండెకరాలు రాసివ్వలేదు. పెళ్ళయిన కొత్తలో అడిగితే ''మా అమ్మాయి మా ఇంటి మహాలక్ష్మి - మహాలక్ష్మి భూలక్ష్మి ఒకేసారి బయటికి వెళ్ళిపోకూడదు. పొలం తర్వాత రాసిస్తా'' అన్నాడు.

తర్వాత్తర్వాత పరిమళ ఆ విషయం అడిగినప్పుడల్లా, ''నీ తమ్ముడి పెళ్ళి అవనీయి. అప్పుడు రాసిస్తాను'' అంటాడు. ఈశ్వరరావు పొలం విషయమై పెళ్ళాన్ని దెప్పటం. నతాయించడం, ఆమె చేత తండ్రికి ఉత్తరాలు రాయించడం చాలాసార్లు జరిగింది. కానీ, పొలం రాసివ్వడం మాత్రం జరగలేదు. అల్లుడు మరీ గొడవ పెట్టకుండా ఉండడం కోసం సోమరాజు ప్రతి నెల నలభై కిలోల బియ్యం, రెండు కొబ్బరికాయలు ట్రాన్స్‌పోర్టు కంపెనీ ద్వారా పంపిస్తాడు. ట్రాన్స్‌పోర్టు చార్జీలు మాత్రం సోమరాజు కట్టడు. అవి ఈశ్వరరావే కట్టుకోవాలి. ఈశ్వరరావు తక్కువవాడేం కాదు. లెక్కలు కట్టడంలో మామకి తగ్గ అల్లుడు. మామగారు పంపించే బియ్యంలో ఇరవై కిలోలు తను అద్దెకుంటున్న ఇంటి ఓనర్‌కి అమ్మేసి, ఆ డబ్బు బ్యాంక్‌లో వేసుకుంటాడు.

ఈశ్వరరావు భార్య పరిమళ మాత్రం అటు తండ్రికి, ఇటు భర్తకి పూర్తిగా వ్యతిరేకం. ఉన్నంతలో హాయిగా, ఆనందంగా బతకాలన్నది ఆమె సిద్ధాంతం. ఆ విషయమై ఈశ్వరరావుకి, పరిమళకి నిత్యం ఘర్షణలు, గొడవలు, యుద్ధాలు జరుగుతుంటాయి.

'ఆ పిసినారి తండ్రి ఇంట్లోంచి బయటపడ్డాననుకుంటే, ఈ పరమ పిసినారి మొగుడి ఇంట్లో పడ్డాను' అని ఆమె చాలాసార్లు బాధపడింది.

తన మామగారు రాసిన ఉత్తరం చదివిన ఈశ్వరరావు గొప్ప నిరాశకు గురయ్యాడు. అంతేకాదు, అతనికి కొత్త బెంగ మొదలైంది.

ఆ ఉత్తరంలో సారాంశం -

''చంద్రం బి.ఏ పాసయ్యాడు. ఎం.ఏ చదువుతానంటున్నాడు. మరో ఏడెనిమిది వేల ఖర్చు తప్పితే ఉపయోగం ఏమీ ఉండదనిపిస్తోంది. వాడికి మీరిద్దరూ తప్ప ఇంకెవరున్నారు? వాడిని త్వరలో హైదరాబాద్ పంపిస్తాను. వాడు అక్కడ మీ ఇంట్లో ఉండి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటాడు. వాడికి కావలసిన సహాయ సహకారాలు అందించవలెను.

వాడు మీకు పూర్తిగా భారమవుతాడని మీరు భయపడక్కర్లేదు. వాడు మీ ఇంట్లో ఉంటాడు కనక మరో పది కిలోల బియ్యం పంపిస్తాను.

మంచి రోజు చూసుకుని వాడు మీ ఇంటికి వస్తాడు.''

ఈశ్వరరావు మనసు నిండా గందరగోళం మొదలైంది.

కానీ, తన మనసులో ఉన్న అభిప్రాయాల్ని ఆందోళనని వెంటనే పైకి చెప్పకుండా లోపలే దిగమింగాడు. పైకి అంటే భార్య కఁయ్‌మని మీద పడిపోతుందని అతనికి తెలుసు.

రాత్రి పరిమళ అతని పక్కన చేరాక మెల్లగా విషయం కదిపాడు.

''చంద్రం విషయం ఏం చేద్దాం?''

''ఏముంది. నాకున్నది ఒక్కగానొక్క తమ్ముడు. వాడికి సహాయం చెయ్యడం నా విధి.''

ఈశ్వరరావు ఏవీ మాట్లాడలేదు. మాట్లాడి ఉపయోగం లేదని అతనికి తెలుసు. అతను అటు తిరిగి పడుకున్నాడు.

బావమరిది వస్తే ఇంటి ఖర్చు ఎంత పెరుగుతుందో లెక్కలు వెయ్యడంలో అతని మెదడు చెడిపోయిన కంప్యూటర్లా అయిపోయింది.

* * *

రెండు సూట్‌కేసులు, మూడు బ్యాగ్‌లు పట్టుకుని ఓ రోజు ఉదయమే చంద్రం హైదరాబాద్‌లో దిగాడు. కృత్రిమమైన చిరునవ్వుని మొహం మీద బలవంతంగా అతికించుకుని ఈశ్వరరావు అతనికి స్వాగతం పలికాడు. పరిమళ ఆనందానికి అంతే లేదు. ఆ ఇంట్లో తనకి కొత్త బలం వచ్చినట్టుగా అనిపించిందామెకి.

చంద్రం తన ఇంట్లో దిగినప్పట్నుంచి ఈశ్వరరావు అతన్ని జాగ్రత్తగా గమనిస్తున్నాడు.

అప్పుడే కాలేజీనుంచి బయటికి వచ్చిన కుర్రాడు, అందునా యువకుడు, చంద్రం మంచి షోకిల్లాలా ఉన్నాడు. రోజూ బ్రిల్ క్రీం రాసే అందమైన ఉంగరాల జుట్టు, ఆ జుట్టుని దువ్వడానికి రకరకాల దువ్వెనలు, జుట్టుకి వాడే రకరకాల షాంపూలు...

చంద్రానికి పదిహేను జతల బట్టలున్నాయి. అన్నీ అల్ట్రా మాడ్రన్‌గా కుట్టించుకున్నవి. నాలుగు రకాల బూట్లు, మరో నాలుగు రకాల చెప్పులు. చంద్రం ఎక్కువ సమయం షోకు చేసుకోడానికి అద్దం దగ్గర గడుపుతాడు.

ఈశ్వరరావు పరిస్థితి చంద్రానికి పూర్తిగా వ్యతిరేకం. అతనికి నాలుగే జతల బట్టలున్నాయి. ఎప్పుడూ తలకి కొబ్బరినూనైనా రాసుకోకుండా తలస్నానం చేస్తాడు. చెప్పులకి రింగులు తెగిపోతే బేరమాడి మళ్ళీ మళ్ళీ కుట్టిస్తాడు. ఇవన్నీ లేమి వల్ల కాదు. పిసినారితనం

ఈశ్వరరావు ఓ నవ్వు నవ్వాడు. అలాంటి నవ్వు అతను మాత్రమే నవ్వగలడు. ఛీ కొడితే చాలా తేలికగా తీసుకొనే నవ్వు. ''ఊరికే నస పెట్టకు. ఆ సిగరెట్ పాకెట్ ఇలా ఇయ్యి'' అన్నాడు మళ్ళీ. ''ముష్టాడిలా అడుక్కో ఇస్తాను'' అన్నాడు ప్రసాద్. ఈశ్వరరావు అలాగే చేశాడు.



వల్ల. చంద్రాన్ని చూస్తే ఈశ్వరరావుకి కోపం, ఈర్ష్య, అసహనం పెరిగిపోతున్నాయి.

'షోకుల కోసం ఇంత ఖర్చుపెట్టే మనిషి, నా మీద పడి తినకపోతే వేరే రూం తీసుకుని ఉండొచ్చుకదా' అన్నది ఈశ్వరరావు అభిప్రాయం.

ఇదిలా ఉండగా, చంద్రం తన ఇంట్లో చేరినప్పట్నుంచి ఖర్చు ఎంత పెరిగిందో లెక్కలు కట్టడం మొదలుపెట్టాడు ఈశ్వరరావు. చంద్రం ఎక్కువసార్లు కాఫీ తాగుతాడు. దానివల్ల మరో అర లీటరు పాలు ఎక్కువ పోయించుకోవలసి వస్తోంది. చంద్రం కలగలవు కూరలు తినడు. అందువల్ల కూరలు ఖరీదుగా ఉన్నా కొనాల్సి వస్తోంది.

చంద్రం రాత్రి పన్నెండు గంటలదాకా నవలలు చదువుతాడు. అతనొక్కడూ హాల్లో పడుకోవడం వల్ల ఇంకో ఫ్యాన్ ఎక్కువ తిరుగుతోంది.

ఈ కారణాల వల్ల కరెంట్ బిల్లు పెరిగిపోయింది. లెక్క వేసుకుని ఇవన్నీ ఆలోచిస్తే ఈశ్వరరావుకి గుండె గుబేలుమంది.

తను కడుపు కట్టేసుకుని, కోర్కెలు చంపేసుకుని, అందరి చేత జోకులు వేయించుకుని - కూడబెడుతున్నదల్లా హుష్ కాకీ అయిపోతోంది. ఈశ్వరరావుకి భయం వేసింది.

అతను ఆలోచించడం మొదలెట్టాడు. ఆలోచించగా, ఆలోచించగా అతనికో పరిష్కారం దొరికింది.

అదేమిటంటే, ఏదో ఒక ప్రైవేట్ కంపెనీలో అర్జంటుగా చంద్రానికి ఓ ఉద్యోగం వెతకడం. అతను ఉద్యోగంలో చేరాక "నీకు సొంత సంపాదన ఉంది కదా, ఏదైనా రూం తీసుకుని కాలక్షేపం చెయ్యి" అని భార్య ద్వారా చెప్పించడం.

ఈ ఆలోచన వచ్చాక ఈశ్వరరావుకి తృప్తిగా అనిపించింది.

ఈశ్వరరావు ఆఫీసు వాళ్ళిచ్చిన క్వార్టర్స్‌లో మూడో అంతస్తులో ఉంటాడు. ప్రతి ఆదివారం కూరల మార్కెట్‌కి వెళ్ళి కూరలు కొనుక్కొస్తాడు. కూరల సంచీ పట్టుకుని మూడు అంతస్తులు ఎక్కేసరికి అతనికి ఆయాసం వస్తుంది.

అలాంటి సమయాల్లో హాల్లో కూర్చున్న చంద్రం ఓసారి కళ్ళెత్తి బావగారి కేసి చూసి మళ్ళీ చదువుతున్న పుస్తకంలో లీనమైపోతాడే తప్ప, ఎదురొచ్చి సంచీ అందుకోడు. ఈశ్వరరావుకి అలాంటి సమయంలో బావమరిదిని పీక పిసికి చంపేద్దామన్నంత కోపం వస్తుంది. ఇదిలా ఉండగా -

ఆ మధ్య ఓసారి ఈశ్వరరావు తన తలిదండ్రుల్ని చూడ్డానికి ఊరు వెళ్ళాడు.

చంద్రం తన ఇంట్లో ఉంటున్నట్టు తల్లికెలా తెల్సిందో, ఆవిడ చాలా నిష్ఠురంగా మాట్లాడింది.

"మీ బావమరది మీ ఇంట్లోనే ఉంటున్నాడట కదా! అవునులే, ఎంతైనా రాణిగారి తమ్ముడు కదా. ఇన్ని సంవత్సరాల్నుంచి ఉద్యోగం చేస్తున్నావు - ఎపుడేనా ఓ చెల్లెల్ని పిలిచి ఓ జాకెట్ గుడ్డ పెట్టావా? ఓ తమ్ముణ్ణి ఇంట్లో పెట్టుకున్నావా? అత్తారింటివాళ్ళంటే తీపి ఎక్కువ" అని మాటల్తో చితగ్గొట్టేసింది.

బావమరిదిని తన ఇంట్లో పెట్టుకోవడం ఇష్టం లేదని, భార్య బలవంతం మీద అలా జరిగిందని అతను తల్లికి చెప్పలేకపోయాడు.

*   *   *

ఈశ్వరరావు చంద్రం కోసం ఉద్యోగవు వేటలో పడ్డాడు. నెలరోజుల్లో ఆ వేట ఫలించింది.

ఓ ప్రైవేట్ కంపెనీలో ఎనిమిది వందల జీతం మీద ఉద్యోగం దొరికింది.

"మీ తమ్ముడికి ఉద్యోగం వచ్చింది కదా, ఏదైనా రూం తీసుకుని వండుకుని తినమను. కావాలంటే మీ నాన్నకి రాసి బియ్యం తెప్పించుకోమను" అని భార్యను పోరడం మొదలెట్టాడు ఈశ్వరరావు.

ఆమె ఒకసారి వినీ విననట్టు ఊరుకునేది. మరోసారి "ఏమిటి, వాడు మీకంత భారమైపోయాడా" అని కఁయ్‌మనేది.

చంద్రానికి మొదటి నెల జీతం ఇచ్చారు. బావగారికి ఓ వంద రూపాయలు చేతిలో పెట్టాడు.

"ఏమిటిది?" ఈశ్వరరావు అడిగాడు.

"మీకు మరీ బర్డెన్ కాకుండా ఉంటుంది. ఉంచండి" అన్నాడు చంద్రం.

ఈశ్వరరావు మనసులో చింతపిక్కల సోమరాజు మెదిలాడు. అతను పరమ పిసినారి. అందులో అనుమానం లేదు. ఆయన తన కోసం కూడా ఖర్చు పెట్టుకోడు.

చంద్రం మనస్తత్వం మరో రకంగా ఉంది.

తన కోసం బాగానే ఖర్చు పెట్టుకుంటాడు. ఎదుటివారి పరిస్థితి పట్టించుకోడు. మొదటి జీతం రాగానే ఓ ప్యాంటు, షర్టు కొనుక్కున్నాడు. చంద్రం చేతిలో వంద రూపాయలు చూసేసరికి ఈశ్వరరావుకి మండిపోయింది.

"అక్కర్లేదు. ఉంచు" అన్నాడు.

"పోనీ కూరలకేనా పనికొస్తాయ్. ఉంచండి" అన్నాడు చంద్రం.

"అక్కర్లేదు. నీ డబ్బుల్లేకుండా కూడా నేను సంసారం నడపగల్ను" అని చరచరా ఇంట్లోంచి బయటికి వెళ్ళిపోయాడు.

*   *   *

వంద రూపాయల సంఘటన జరిగినప్పట్నుంచి ఈశ్వరరావుకి పూర్తిగా మనసు విరిగిపోయింది. చంద్రాన్ని ఇంట్లోంచి బయటికి పంపెయ్యమని భార్యమీద ఒత్తిడి తేవడం ఎక్కువ చేశాడు. అతని బాధ తట్టుకోలేక పరిమళ తండ్రికి ఉత్తరం రాసింది.

"'వాడికి ఉద్యోగం వచ్చింది. మరో రెండు, మూడు నెలల్లో జీతం కూడా పెరుగుతుంది. మా ఇల్లు బాగా ఇరుకు. ఇల్లు సరిపోవడం లేదు. కాబట్టి వాణ్ణి వేరే రూం తీసుకుని ఉండమందామనుకుంటున్నాను. మరో ఇద్దరితో కలిసి రూం తీసుకుంటే వాడికెక్కువ భారం పడదు. వండుకుని తినడమో, మెస్‌లో తినడమో చెయ్యొచ్చు. అవసరమైతే నీ ఆర్థిక సహాయం ఎలాగూ ఉంటుంది" - ఇదీ సారాంశం.

ఆ ఉత్తరం చూసిన చింతపిక్కల సోమరాజుకి పిచ్చెక్కినట్టయింది. కొడుకు ఖర్చు మనిషని అతనికి తెలుసు. అంతేకాదు, కొడుకు జీతంలో పొదుపు చేసి కొంత పంపించమని చెప్పి, అది వడ్డీకి తిప్పుదామని అతను ప్లాన్ వేశాడు.

ఆ ప్లానంతా భగ్నమైపోతుంది.

అతను బాగా ఆలోచించి కూతురికి ఉత్తరం రాశాడు.

"నీ సొంత తమ్ముడి విషయంలో నువ్వలా ఎందుకు ఆలోచిస్తున్నావో నాకర్థం కావడం లేదు. వాడి వయసు మంచిది కాదు. ఈ వయసులో వేరే ఉండటం మంచిది కాదు. చెడు స్నేహాలు, చెడు తిరుగుళ్ళు అలవాటయ్యే ప్రమాదం ఉంది. అందునా మీరుంటున్నది నగరం.

మీకు వాడు భారమనుకుంటే మరో అయిదు కిలోల బియ్యం, మరో రెండు కొబ్బరికాయలు పంపిస్తాను. వాడికి కాస్త మంచి ఉద్యోగం వచ్చి నిలదొక్కుకుంటే పెళ్ళి చేసేస్తాను. అప్పుడెలాగూ వాడు వేరే కాపురం పెట్టుకుంటాడు. అంతదాకా వాణ్ణి కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత నీదే."

ఆ ఉత్తరం చదివిన ఈశ్వరరావుకి ఒళ్ళంతా కారం రాసుకున్నట్టనిపించింది.

మొదటి నెల జీతం రాగానే వంద రూపాయలిచ్చి వద్దనిపించుకున్న చంద్రం మరి డబ్బు ఇచ్చే ప్రయత్నం చేయలేదు. ఈలోగా అతనికి మరో మంచి కంపెనీలో ఉద్యోగం వచ్చి జీతం పదిహేను వందలకి పెరిగింది.

చంద్రాన్ని ఇంట్లోంచి బయటికి పంపెయ్యమని ఈశ్వరరావు పోరుతూనే ఉన్నాడు. కానీ, పరిమళ లక్ష్యపెట్టడం లేదు.

ఏమైనా తమ్ముడి పెళ్ళయ్యేదాకా అతన్ని ఇంట్లోనే అట్టేపెట్టుకోవాలని పరిమళ నిశ్చయించుకుంది.

మరికొంత కాలం గడిచింది.

ఓ రోజు - పరిమళ, చంద్రం - ఇద్దరూ ఇంట్లో లేరు.

హేంగర్‌కి వేలాడుతున్న చంద్రం చొక్కా జేబులో ఈశ్వరరావుకి ఓ ఉత్తరం కనిపించింది. అతనికి చదవాలనిపించింది.

అది చింతపిక్కల సోమరాజు, చంద్రానికి ఆఫీసు అడ్రస్‌కి రాసిన ఉత్తరం.

అది చదివిన ఈశ్వరరావుకి తన కాళ్ళ కింద భూమి వంగిపోతున్నట్టు, నెత్తి మీద ఆకాశం మొట్టికాయలు వేస్తున్నట్టు, తన జేబుని ఎవరో కత్తిరిస్తున్నట్టు, తన చేతకానితనాన్ని ఎవరో వెక్కిరిస్తున్నట్టు, తనని ఎవరో కత్తితో పొడవటానికి వస్తున్నట్టు రకరకాల ఊహలు, భయాలు, ఆలోచనలు వచ్చాయి.

అతనికి పిచ్చెక్కుతుందేమోనన్న అనుమానం వచ్చింది.

ఓ స్నేహితుణ్ణి సిగరెట్లు, మరో స్నేహితుణ్ణి కాఫీ, మరో స్నేహితుణ్ణి టిఫిన్ అడిగి, సాధ్యమైనంతవరకు జేబులో డబ్బులు తియ్యకుండా కాలక్షేపం చేసే తన తెలివితేటలు ఎందుకూ కొరగాకుండా పోయిన ఆలోచన అతన్ని బాధ పెట్టింది. అతన్ని భయకంపితుణ్ణి చేసింది.

ఉత్తరం మళ్ళీ చదివాడు. మళ్ళీ మళ్ళీ చదివాడు. ఆ ఉత్తరం ద్వారా అతను గ్రహించిన విషయం -

చంద్రం ప్రతి నెలా తండ్రికి వెయ్యి రూపాయలు పంపిస్తున్నాడు.

అతని తండ్రి ఆ డబ్బుని వడ్డీలకు తిప్పుతున్నాడు. తన కష్టం మీద చంద్రం సంపద కూడబెట్టుకుంటున్నాడు. 'ఇంక వాడు ఫినిష్' అనుకున్నాడు ఈశ్వరరావు.

'ఒరేయ్ రాస్కెల్, నా తెలివితేటల్ని వెక్కిరిస్తున్నావా? చూడు నా విశ్వరూపం' అని కూడా అనుకున్నాడు.

అదే రోజు రాత్రి ''నీ తమ్ముణ్ణి వేరే రూం తీసుకుని ఉండమను. అతనింక ఒక్కక్షణం మనింట్లో ఉండటానికి వీల్లేదు'' అన్నాడు.

అంతే! ఆరోజు నుంచి ఈశ్వరరావు, పరిమళల మధ్య గొడవ మొదలైంది.

చంద్రం ఇంట్లో ఉండటానికి వీల్లేదని ఈశ్వరరావు, చంద్రం ఇంట్లోనే ఉంటాడని పరిమళ.

చంద్రం మాత్రం ఇవేమీ పట్టనట్టుగా హాయిగా, హుషారుగా, ఆనందంగా ఉన్నాడు.

ఈశ్వరరావు గదిలో పడుకోడం మానేశాడు. తర్వాత పరిమళతో మాట్లాడ్డం మానేశాడు. తర్వాత ఇంట్లో భోజనం చెయ్యడం మానేశాడు.

బయట మెస్ బిల్లు పెరిగిపోతోందే తప్ప ఫలితం కనబళ్ళేదు. ఈ విషయంలో ఒక్క అంగుళం కూడా వెనక్కి తగ్గేది లేదని పరిమళ నిర్ణయించుకుంది.

ఆఖరికి చంద్రాన్ని ఇంటి బయట కలిసి, "నీ వల్ల మా ఇద్దరి మధ్య గొడవలవుతున్నాయి. నువ్వు వేరే రూం తీసుకుని ఉండు'' అని చెప్పాడు ఈశ్వరరావు.

చంద్రం అయిదు వందల రూపాయల నోటులా మొహం పెట్టి, ''అక్క ఎలా చెప్తే అలా చేస్తాను'' అన్నాడు.

> ఈశ్వరరావు భార్యతో యుద్ధం ప్రారంభించాడు. "మీ తమ్ముడు ఇంట్లో ఉండటానికి వీల్లేదు" అన్నాడు. గిన్నెలు, చెంబులు విసిరి కొట్టాడు.

చంద్రం చొక్కా జేబు చింపేద్దామన్నంత కోపం వచ్చింది ఈశ్వరరావుకి.

కానీ, తమాయించుకున్నాడు.

* * *

ఎంత ఆలోచించినా ప్రసాద్‌కి పరిష్కారం కనబళ్ళేదు.

''తాడు తెగేదాకా లాగడం మంచిది కాదు. వాడి పెళ్ళయ్యేదాకా నీకీ బాధ తప్పదు. జీవితంలో అన్నీ మనం అనుకున్నట్టుగా జరగవు. పోనీ ఓ పని చేస్తే?''

ఈశ్వరరావు చాలా ఆశగా ప్రసాద్ మొహంలోకి చూశాడు.

''ఉద్యోగం వస్తే బయటికి పోతాడని ఉద్యోగం వేయించావ్. అయినా, ఫలితం కనబళ్ళేదు. బాగా కట్నం ఇచ్చే సంబంధం చూసి మీ మావగారికి సజెస్ట్ చెయ్యి. ఆయనెలాగూ డబ్బు ఆశపరుడు కాబట్టి పెళ్ళి చేసేస్తాడు. వాడు వేరే మకాం పెట్టుకుంటాడు.''

''ఇంకా నయం. ఆ పెళ్ళాంతో సహా మా ఇంట్లో మకాం పెట్టినా ఆశ్చర్య పోనక్కర్లేదు'' అన్నాడు ఈశ్వరరావు.

''అయితే, కొన్నాళ్ళు ఎడ్జస్ట్ అయిపో. మీ ఆవిడ మొండికేసింది కదా!''

"కుదరదు గాక కుదరదు" అని శివతాండవం చేసే పోజులో లేచి నిలబడ్డాడు ఈశ్వరరావు.

* * *

అదే రోజు ఈశ్వరరావు భార్యతో యుద్ధం ప్రారంభించాడు.

"మీ తమ్ముడు ఈ ఇంట్లో ఉండటానికి వీల్లేదుగాక వీల్లేదు'' అన్నాడు:

గిన్నెలు, చెంబులు విసిరికొట్టాడు. ఇంట్లో ఎలక్ట్రిక్ ఫ్యూజ్ తీసేసి బయటికి గిరాటేశాడు. ఆమె చీరలన్నీ నలిపేశాడు. ఆమె పట్టు చీరలు నీళ్ళలో ముంచేశాడు.

హాల్లో గోడకి వేలాడుతున్న తమ పెళ్ళినాటి ఫొటో నేలకేసి కొట్టాడు.

ఆమెను తిట్టాడు. ఆమె తండ్రిని తిట్టాడు. ఆమె తమ్ముణ్ణి తిట్టాడు. ఆమె వంశాన్ని తిట్టాడు. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించేసుకుంటానన్నాడు. మూడు రోజులపాటు నానా హంగామా, హడావిడి చేశాడు.

ఆమె ఎదిరించింది. మాటకి మాటా అంది. అతను తిడితే తిరిగి తిట్టింది. అతను కొట్టడానికి చెయ్యెత్తితే ''దెబ్బ పడితే, కిర్సనాయిల్ డబ్బా ఖాళీ'' అంది.



ఓ రోజు సాయంత్రం అతను ఇంటికి వచ్చేసరికి ఇల్లు తాళం వేసి ఉంది. ఎదురు క్వార్టర్‌లో అడిగితే తాళం ఇచ్చి, ''ఆమె విషయం మాకు తెలియదు'' అన్నారు.

తాళం తీసుకుని లోపలకి వెళ్ళాడు.

''నేను పుట్టింటికి పోతున్నాను. మీరు వచ్చి కాళ్ళా వేళ్ళా పడితేగాని రాను'' అని రాసున్న చీటీ కనిపించింది.

'పోతే పోయింది. శని వదిలింది' అనుకున్నాడు. కాళ్ళు బార్లా జాపి పడక్కుర్చీలో కూర్చున్నాడు.

ఓ గంట పోయాక చంద్రం వచ్చాడు. ఈశ్వరరావు నిర్లిప్తంగా అతని కేసి చూశాడు. చంద్రం ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

''మా అక్క మూర్ఖురాలు. బంగారం లాంటి భర్త, మిమ్మల్ని వదిలేసి పుట్టింటి కెళ్ళింది. అంతకీ అన్ని విధాలా చెప్పి చూశాను. వినిపించుకోలేదు. కొంతమంది అంతే, సుఖపడటం చేతకాదు.

మీరేం కంగారుపడకండి. ఈవేళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండి - అది ఇక్కడికి రావల్సిందే.

నేనో నిర్ణయానికొచ్చాను.'' చంద్రం చెప్పడం ఆపాడు.

ఈశ్వరరావు చాలా ఆశగా చంద్రం మొహంలోకి చూశాడు.

"ఏమిటది?'' మొహంలో ఆసక్తి కనబడకుండా అడిగాడు.

''అది వెర్రిది. మీ మంచితనం తెలుసుకోలేక వెళ్ళిపోయింది. మీ మంచితనం నాకు తెలుసు. నేను ఇక్కడే ఉండి, మీ మంచిచెడ్డ చూసుకుంటాను.''

ఈశ్వరరావు చిర్నవ్వు నవ్వాడు.

ఆ నవ్వులో వేదాంతం ఉంది. ఆ నవ్వులో విరక్తి ఉంది. ఆ నవ్వులో తన మామగారు చింతపిక్కల సోమరాజుని చింత చెట్టుకి ఉరేసి వేలాడదియ్యాలన్నంత కసి ఉంది. ■